క్లుప్తంగా

వివాహ వేడుకలో మాజీ మంత్రి సురేష్



నూతన వధువును ఆశీర్వదిస్తున్న ఆదిమూలపు సురేష్

కొండపి(సింగరాయకొండ): కొండపి మండలం నెన్నూరుపాడులో శుక్రవారం వైఎస్సార్‌ సీపీ నాయకుడు వెంకట రమణారెడ్డి కుమార్తె వివాహ కార్యక్రమంలో మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జి డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌ పాల్గొన్నారు. నూతన వధువును ఆశీర్వదించారు. కార్యక్రమంలో కొండపి మండల వైఎస్సార్‌ సీపీ కన్వీనర్‌ అరికట్ల కోటిలింగయ్య, జేసీఎస్‌ కన్వీనర్‌ గొట్టిపాటి మురళి, గ్రామ నాయకులు, మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవ దంపతులకు మాజీ మంత్రి ఆశీర్వాదం

కొండపి(సింగరాయకొండ): కొండపి మండలంలోని చోడవరం వైఎస్సార్‌ సీపీ నాయకుడు కొల్లూరి శ్రీనివాసరావు కుమారుని వివాహానికి శుక్రవారం మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జి డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌ హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కొండపి మండల పార్టీ సీనియర్‌ నాయకులు బొక్కిసం సుబ్బారావు, చోడవరం గ్రామ నాయకుడు వెంకటనర్సు, మిట్టపాలెం నాయకుడు మండవ మాలకొండయ్య, కోటపాటి చంద్ర, వై.వసంత్‌ తదితరులు పాల్గొన్నారు.



వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి సురేష్‌

చెట్టు మహాలక్ష్మమ్మకు లక్ష తులసీ పూజ



తులసీ పూజ అందుకుంటున్న చెట్టుమహాలక్ష్మమ్మ

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్‌ రోడ్డులోని చెట్టు మహాలక్ష్మమ్మ దేవస్థానంలో శ్రావణ మాస తొలి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు లలితా సహస్ర నామం చదివి అమ్మవారికి లక్ష తులసి పూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్‌ కుమార్‌

సింగరాయకొండ: సింగరాయకొండ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.46 లక్షలు దుర్వినియోగం చేశారని మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌ తమీమ్‌ అన్సారియాకు అందిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టామని విచారణాధికారి, స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ ఎ.కుమార్‌ తెలిపారు. కలెక్టర్‌ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విచారణ అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎల్‌పీఓ, పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్డీ, గ్రామ సర్పంచ్‌ను విడివిడిగా విచారించినట్లు తెలిపారు. పంచాయతీ రికార్డులు పరిశీలించిన అనంతరం సమగ్ర నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

పోలీసు అధికారుల నియామకం



ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావు

కందుకూరు: కందుకూరు సర్కిల్‌ నూతన సీఐగా నియమితులైన కె. వెంకటేశ్వరరావు శుక్రవారం స్థానిక కార్యాలయంలో సీఐగా బాధ్యతలు చేపట్టారు. నిన్నటి వరకు సీఐగా పని చేసిన నఫీజ్‌బాషా ఇక్కడి నుంచి రిలీవ్‌ అయి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా నూతన సీఐకి పలువురు ఎస్సైలు అభినందనలు తెలిపారు.

పట్టణ ఎస్సైగా మరిదినాయుడు

కందుకూరు పట్టణ నూతన ఎస్సైగా మరిదినాయుడు, రూరల్‌ స్టేషన్‌ ఎస్సైగా బి. బాలమహేంద్రనాయక్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటి వరకు కందుకూరు పట్టణ ఎస్సైగా పనిచేస్తున్న ఆనందభాస్కర్‌ను నెల్లూరు వీఆర్‌కు, రూరల్‌గా ఎస్సైగా ఉన్న నరేష్‌ను విడవలూరు పోలీస్‌ స్టేషన్‌కు బదిలీ చేశారు.

చెత్త నుంచి సంపద సృష్టిపై దృష్టి సారించాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో కాయగూరల సాగును పరిశీలిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్‌లు



మహదేవపురంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న రామనాథం, ఎంపీడీఓలు

పామూరు: చెత్త నుంచి సంపద సృష్టించడంపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీఓ పల్లెల పుల్లారెడ్డి అన్నారు. పామూరులో గత రెండు రోజులుగా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శానిటేషన్‌, సాలిడ్‌ వేస్ట్‌ మేనేజ్మెంట్‌ జీపీడీపీ శిక్షణలో భాగంగా శుక్రవారం రెండోరోజు స్థానిక కందుకూరు రోడ్డులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఫీల్డ్‌ విజిట్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో కంపోస్ట్‌ ఎరువుల తయారీ, ప్రత్యేకంగా ఏర్పాటు చేసి తోటల్లో మొక్కల పెంపకం, ఆకుకూరలు, కాయకూరల పెంపకంపై క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్పంచ్‌లు, పీఎస్‌లకు వివరించారు. తడిచెత్త, పొడిచెత్త సేకరణలో అవలంబించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌ఆర్డీ కేఎల్‌ శ్రీనివాసరావు, ఏవో ఊట్ల శ్రీనివాసులు, సర్పంచ్‌లు, పీఎస్‌లు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం సందర్శన

కందుకూరు రూరల్‌: గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులకు జరుగుతున్న రిఫ్రెషర్‌ శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మహదేవపురం గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సందప కేంద్రాన్ని ఏపీ స్టేట్‌ ఎస్‌ఆర్‌డీఏ జాయింట్‌ డైరెక్టర్‌ రామనాథం శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సంపద కేంద్రంలో ఏర్పాటు చేసిన వర్మీకంపోస్ట్‌ బెడ్లను పరిశీలించి కేంద్రం మంచి వాతావరణలో ఉందని తెలిపారు. కేంద్రం వద్ద మొక్కలను, పూల చెట్లను పెంచాలని కోరారు. ఈ కేంద్రానికి వాటర్‌ సదుపాయం ఉన్నందున కూరగాయలు కూడా పెంచాలని సూచించారు. కేంద్రం ద్వారా గ్రామ పంచాయతీకి అదనపు ఆదాయ వనరులు చేకూరుతాయన్నారు. మండల పరిషత్‌ అభివృద్ధి అధికారి ఏ.ప్రమీల రాణి, ఈఓపీఆర్డీ ఎస్‌.చంద్రసేన్‌, ఆర్‌డబ్ల్యూఎస్‌ రీసెర్చ్‌ కో ఆర్డినేటర్‌ రమణయ్య, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇంజనీరింగ్‌ అసిస్టెంట్లు, గ్రీన్‌ అంబాసిటర్లు పాల్గొన్నారు.

బడా కార్పొరేట్‌ కంపెనీలను బహిష్కరించాలి

- నిరసన ప్రదర్శనలో ప్రజా సంఘాల నేతలు



నల్ల బెలున్లతో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

కొండపి(సింగరాయకొండ): బడా కార్పొరేట్‌ కంపెనీలను బహిష్కరించి, వారి దోపిడీని అరికట్టాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు రైతు, రైతు కూలీ సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొండపి బస్టాండ్‌ సెంటర్లో శుక్రవారం నల్ల బెలూన్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పరిటాల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం బడా కార్పొరేట్‌ కంపెనీలకు రాయితీలు, రుణాలు మంజూరు చేస్తూ పేదలకు మాత్రం తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. రైతులకు అనుకూలమైన రుణ విమోచన చట్టం, విత్తన చట్టం, స్వామినాథన్‌ కమిషన్‌ సిఫార్సులు అమలు చేయాలన్న విజ్ఞప్తులను బుట్టదాఖలు చేస్తోందని దుయ్యబట్టారు. వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి రావులపల్లి లక్ష్మి మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పత్తులను 10 రెట్లు ఎక్కువగా అమ్ముతున్న బడా కార్పొరేట్‌ కంపెనీలకు రాయితీలు, రుణాలివ్వడం ఏమిటని మండిపడ్డారు. దేశానికి అన్నం పెడుతున్న రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు రుణాలు ఎగ్గొట్టిన బడా కంపెనీలకు రుణమాఫీ చేసి, మళ్లీ రుణాలు మంజూరు చేస్తూ కార్పొరేట్‌ ప్రభుత్వంగా ఎన్‌డీఏ మారిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దేవూరి బ్రహ్మయ్య, మాలకొండయ్య, కొమ్ము రోశయ్య, రైతు కూలీ సంఘ నాయకులు పరిటాల రాధాకృష్ణ, వెన్నపూసల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

లింగసముద్రం: అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.బాజీబాబు చెప్పారు. శుక్రవారం అన్నెబోయినపల్లె వద్ద ఉన్న మన్నేరు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి ఇసుక ట్రాక్టను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పెండింగ్‌ బకాయిలు విడుదల చేయండి

ఉలవపాడు: గత పదివారాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీల పెండింగ్‌ బకాయిలను విడుదల చేయాలని ఐయఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి మోహన్‌ డిమాండ్‌ చేశారు. కూలీలకు రావాల్సిన 3600 కోట్ల రూపాయల బకాయిలను ప్రభుత్వాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వలన కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఉపాధి హామీ నిధులను వెంటనే విడుదల చేయడంతోపాటు కూలీ పనుల ప్రదేశాల్లో వసతులు కల్పించాలని డిమాండ్‌ చేశారు.

రైతు భరోసా సిబ్బందిని తొలగించవద్దు



ఎన్‌.చంద్రమౌళి

కందుకూరు రూరల్‌: రైతు భరోసా కేంద్రాల్లో సేవలు అందించే వెటర్నరీ, అగ్రికల్చర్‌ అసిస్టెంట్లను తొలగించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని వైఎస్సార్‌ రైతు విభాగం సెక్రటరీ ఎస్‌.చంద్రమౌళి కోరారు. ప్రభుత్వం వెటర్నరీ హాస్పిటల్‌లో వైద్యుల కొరత, హాస్పిటల్స్‌ తక్కువగా ఉన్నందున సచివాలయ పరిధిలోని వెటర్నరీ అసిస్టెంట్ల సేవలు రైతాంగానికి బాగా ఉపయోగపడుతున్నాయన్నారు. అలాగే అగ్రికల్చర్‌ అసిస్టెంట్లు విత్తనాల రిజిస్ట్రేషన్‌, ఎరువులు తక్కువ ధరలకు రైతులకు అందించడం, పంటల వివరాల, ఈ క్రాఫ్‌ ద్వారా పంటలకు ఇన్సూరెన్స్‌ వంటి సేవలు అందతున్నాయన్నారు.

మహిళా రైతుపై దాడి

కనిగిరి రూరల్‌: పొలం గొడవలో మహిళా రైతుపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మండలంలోని కొత్తఏరువారిపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఏరువారిపల్లికి చెందిన పాశం శ్రీలక్ష్మి పొలం గడ్డి కోస్తుండగా.. అదే గ్రామానికి చెందిన బి.తిరుపాలు తన పొలంలో గడ్డి ఎందుకు కోస్తున్నావంటూ గొడవకు దిగాడు. ఈ వివాదంలో తిరుపాలు కాళ్లు, చేతులు, కర్ర, కొడవలితో శ్రీలక్ష్మిని కొట్టి గాయపరిచినట్లు తెలిపారు. క్షతగాత్రురాలిని 108లో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమన్వయంతో పని చేయాలి

గుడ్లూరు (కందుకూరు రూరల్‌): ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. గుడ్లూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పులి రమేష్‌ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్‌ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు, అనుబంధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా త్వరలో భారీ ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాబోతున్నాయన్నారు. వెనుకబడిన కందుకూరు నియోజకవర్గానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. గుడ్లూరులో ట్రాఫిక్‌ సమస్యపై పోలీసులు దృష్టి పెట్టాలని సీఐ మంగరావుకు సూచించారు. మండలంలో తగినంత మంది విద్యుత్‌ లైన్‌మెన్లను నియమించడంతోపాటు లోఓల్టేజీ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓ వై.వెంకటేశ్వరరావు, తహసీల్దార్‌ స్వర్ణ, సీఐ మంగారావు, డీఎల్‌పీఓ కృష్ణమోహన్‌, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి

శిథిల భవనంలో చిన్నారుల చదువులు



నెర్రెలిచ్చిన అంగన్‌వాడీ భవనం గోడ



అధ్వానంగా భవనం పరిసరాలు

టంగుటూరు: మండలంలోని మర్లపాడు గ్రామంలో జిల్లా పరిషత్‌ హైస్కూల్కు ఎదురుగా ఉన్న అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనం గోడలు నెర్రెలివ్వడంతోపాటు, కిటికీలు పూర్తిగా విరిగిపోయాయి. ప్రహరీ లేకపోవడంతో అపరిశుభ్రంగా ఉండటమే కాకుండా గడ్డి, చెత్తాచెదారంతో దోమలకు నిలయంగా మారింది. భవనం ఫ్లోర్‌ ధ్వంసమైంది. భవనానికి మరమ్మతులు చేయించడంతోపాటు ప్రహరీ నిర్మించి చిన్నారులకు రక్షణ కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జై జవాన్‌.. జై కిసాన్‌పై అవగాహన



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి రాము

కందుకూరు రూరల్‌: ఆజాద్‌ కా అమృత్‌ మహోత్సవ్‌ – హర్‌ ఘర్‌ తిరంగ్‌లో భాగంగా విద్యార్థులకు జై జవాన్‌ – జై కిసాన్‌పై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి వి.రాము మాట్లాడుతూ విద్యార్థులకు నేల, పర్యావరణ, కాలుష్యం, భూసారం, పరిరక్షణ, పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యత గురించి వివరించారు. పాఠశాల ఆవరణంలో వ్యర్థ పదార్థాలు సేకరించి కంపోస్టు ఎరువులను తయారు చేయాలని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలన్నారు. కూరగాయాల మొక్కలు, పెరటి మొక్కలు వేసి పాఠశాల పరిసరాల్లో మొక్కల పెంపకంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలన్నారు. వ్యవసాయాధికారి (ల్యాబ్‌) వి.గీతాప్రకాష్‌ మాట్లాడుతూ నేల రకాలు, సమస్యాత్మక నేలలు వాటి నివారణ గురించి, మట్టి నమూనాల సేకరణ గురించి వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయాధికారి పి.మాధవ సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యత, ఉత్పత్తులు, కిచెన్‌ గార్డెన్‌లపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రశ్నోత్తరాల పోటీలో నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల హెచ్‌ఎం నరసింహమూర్తి, ఉపాధ్యాయులు ఎస్‌.విప్రనారాయణ, ఎస్‌కే సందాని బాష, డి.శ్రీనిధి, ఎంవీబీఎస్‌, సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన బుర్రా



పలుకూరులో వధూవరులను ఆశీర్వదిస్తున్న బుర్రా



పత్తిపాటివారిపాలెంలో శ్రీనాగర్పమ్మ అమ్మవారి దివ్య ప్రతిష్ట మహోత్సవంలో..

కందుకూరు రూరల్‌: మండలంలోని పలుకూరు గ్రామానికి బొల్లిబోయిన వారి వివాహ వేడుకల్లో కందుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌ యాదవ్‌ పాల్గొని వధూవరులు బొల్లిబోయిన వెంకట వేణుగోపాల్‌.. శివ పూజితలను ఆశీర్వదించారు. అదే విధంగా పలుకూరు పంచాయతీలోని పత్తిపాటివారిపాలెం గ్రామం వద్ద వేంచేసి ఉన్న శ్రీనాగర్పమ్మ అమ్మవారి దివ్య ప్రతిష్ట మహోత్సవంలో బుర్రా పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన



మాచవరంలో వరి పంట పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి రాము

కందుకూరు రూరల్‌: మండలంలోని మాచవరం గ్రామంలో సాగు చేస్తున్న వరి పంటను మండల వ్యవసాయాధికారి వి.రాము శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరి రకం కేఎస్‌ఎం 1638 పంట 40–45 రోజుల వ్యవధిలో పిలకల దశలో ఉందని తెలిపారు. రైతులు మిశ్రమ ఎరువులు వాడకం తగ్గించి పొట్ట దశలో యూరియా 50 కిలోలు, పొటాష్‌ ఎరువులను 30 కేజీలు ఒక ఎకరాకి వాడాలన్నారు. ఇ– పంట నమోదు చేసుకోనడానికి సాగుదారులు, కౌలు రైతులకు అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయ సహాయకులు సీహెచ్‌ రోజిరేచల్‌, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి బాలినేనిని కలిసిన దద్దాల



బాలినేని శ్రీనివాసరెడ్డితో దద్దాల నారాయణ యాదవ్‌

కనిగిరి రూరల్‌: మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని వైఎస్సార్‌ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్‌ దద్దాల నారాయణయాదవ్‌ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని బాలినేని నివాసానికి వెళ్లి కలిసి మాట్లాడారు. కనిగిరి నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితుల గురించి బాలినేనికి దద్దాల వివరించారు. నియోజకవర్గంలో గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని బాలినేని సూచించినట్లు దద్దాల తెలిపారు. దద్దాల వెంట వైఎస్సార్‌ సీపీ నాయకులు గోబ్బిళ్ల శ్రీను, దాసరి మురళి, వాకుమళ్ల రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థినులకు కేజీబీవీలు వరం



మాట్లాడుతున్న ఎంఈఓ కరుణకుమారి

పామూరు: పేద విద్యార్థినులకు కేజీబీవీలు వరంలాంటివని మండల విద్యాశాఖాధికారి గరికపాటి కరుణకుమారి అన్నారు. స్థానిక కేజీబీవీలో శుక్రవారం ఎస్‌ఓ కటకం సజన అధ్యక్షతన సీనియర్‌, జూనియర్‌ విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వచ్చే వార్షిక పరీక్షల్లో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌ విద్యార్థినులు నూరుశాతం ఫలితాలు సాధించి సత్తాచాటాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం రూ.వేల కోట్లు ఖర్చుచేస్తున్నాయన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా కేజీబీవీల్లో డిజిటల్‌ బోధన, ట్యాబ్‌లు, క్రీడా ప్రాంగణాలు ఉన్నాయన్నారు. ప్రతి విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని, ఆ విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, కె.వెంకట రమణయ్య, బొల్లా నరసింహారావు, ఉప్పలపాటి హరిబాబు, ఎ.ప్రభాకర్‌చౌదరి, ఇర్రి కోటిరెడ్డి, ఆకుపాటి వెంకటేష్‌, పందిటి హరీష్‌, షేక్‌ నాయబ్‌రసూల్‌, సోమిశెట్టి నారాయణ, పువ్వాడి రామారావు, పిడుగు శ్రీను, రహీముల్లా, కేజీబీవీ ఏఓ వాణి, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు సరాసరి ధర కేజీ రూ.307.85



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు



కొండపిలో వేలాన్ని పర్యవేక్షిస్తున్న సునీల్‌ కుమార్‌

టంగుటూరు: స్థానిక వేలం కేంద్రంలో శుక్రవారం పొగాకు ధర సరాసరి ధర కేజీ 307.85 పలికిందని ఎ.శ్రీనివాసరావు తెలిపారు. కారుమంచి క్లస్టర్‌ పరిధిలోని గ్రామాల్లో రైతులు 834 బేళ్లు వేలానికి తీసుకురాగా అందులో 743 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 91 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.205, వేలంలో 16 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండపిలో 833 బేళ్లు కొనుగోలు

కొండపి(సింగరాయకొండ): కొండపి వేలం కేంద్రంలో శుక్రవారం పొగాకు సరాసరి ధర కేజీ 302.19 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌ కుమార్‌ తెలిపారు. చోడవరం, ముప్పవరం క్లస్టర్‌ పరిధిలోని రైతులు 974 బేళ్లు వేలానికి ఉంచగా 833 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 141 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.205 పలికింది. వేలంలో 18 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

కెరీర్‌ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన అవసరం



కెరీర్‌ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్‌

సీఎస్‌ పురం (పామూరు): కెరీర్‌ గైడెన్స్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై బి.ప్రేమ్‌కుమార్‌ అన్నారు. సీఎస్‌ పురం మండలంలోని శీలంవారిపల్లెలో కదిరి వెంకట నర్సయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ప్లస్‌లో శుక్రవారం హెచ్‌ఎం నాగినేని తిరుపతయ్య అధ్యక్షతన విద్యార్థులకు కెరీర్‌ గైడెన్స్‌, నూతన చట్టాలు, మొదలైన అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై ప్రేమ్‌కుమార్‌ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యతో పాటు కంప్యూటర్‌ పరిజ్ఞానం, సాంకేతికత, బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణిస్తేనే వారి భవిష్యత్‌ బంగారు బాటగా ఉంటుందన్నారు. సమాజంలోని అంశాలపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. నూతన చట్టాలు, ఐపీసీ సెక్షన్ల గురించి వివరించారు. మత్తుపదార్థాలు, సెల్‌ఫోన్లకు అడిక్ట్‌ అవ్వడం, ర్యాష్‌ డ్రైవింగ్‌ వల్ల అనర్థాలను వివరించారు. విద్యార్థులు పాఠశాలల్లో విద్యావనరులను వినియోగించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్‌ మూరం మస్తానయ్య, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు




బాబా ఆలయంలో లక్ష్మీదేవి పూజలో పాల్గొన్న భక్తులు

కనిగిరి రూరల్‌: స్థానిక షిరిడీ సాయిబాబా దేవస్థానంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గణపతి పూజ, కుంకుమార్చన, అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజల్లో పాల్గొన్న భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు, ప్రసాదం, రవిక అందజేశారు. మణికంఠ స్వామి, ప్రిన్స్‌ తివారిస్వామి, నారాయణస్వామి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముత్యాల ధర్మారావు, ఏసీ చెంచులు, వీసీ రామశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు. అలాగే, పట్టణంలోని పాదిలి రోడ్డులో గల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

స్తంభం మారింది.. సమస్య తీరింది

సాక్షి ఎఫెక్ట్‌..



నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్‌ స్తంభం

టంగుటూరు: మండలంలోని మర్లపాడు సచివాలయం సమీపంలో విద్యుత్‌ స్తంభం విరిగి ప్రమాదకరంగా ఉన్న వైనంపై ‘సాక్షి’లో ప్రచురించిన కథనంపై విద్యుత్‌ శాఖ అధికారులు స్పందించారు. విరిగిన విద్యుత్‌ స్తంభం స్థానంలో మరొకటి ఏర్పాటు చేసి అవసరమైన మరమ్మతులు చేశారు. భవిష్యత్‌లో ఎటువంటి సమస్య రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటామని టంగుటూరు రూరల్‌ విద్యుత్‌ శాఖ ఏఈ టి.చంద్రశేఖర్‌ తెలిపారు.

కేజీబీవీని తనిఖీ చేసిన జడ్జి

కనిగిరి రూరల్‌: మండలంలోని పేరంగుడి సమీపంలో గల కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాన్ని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్‌, కనిగిరి జూనియర్‌ సివిల్‌ జడ్జి కే భరత్‌చంద్ర శుక్రవారం తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, వంటశాల పరిశుభ్రతలను పరిశీలించారు. మెనూ పట్టికను పరిశీలించారు. అల్పాహారాన్ని రుచి చూశారు. పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేశారు. ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా.. కనిగిరి కోర్టులోని మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని విద్యార్థినులకు తెలిపారు. బాలికల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, ఏదైనా సమస్యలుంటే తక్షణం ఉన్నతాధికారులదృష్టికి తీసుకెళ్లాలనిఅధికారులకుసూచించారు.

సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి

హనుమంతునిపాడు: ఆంధ్రప్రదేశ్‌ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపు మేరకు శనివారం కనిగిరిలో జరిగే నియోజకవర్గ మాలల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని సమితి సభ్యులు ఒక ప్రకటనలో కోరారు. కనిగిరి జీబుల సెంటర్‌ వద్ద సమావేశం జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ అనుకూల తీర్పుతో మాలలకు జరిగే నష్టంపై సమావేశంలో చర్చిస్తారన్నారు. నియోజకవర్గంలోని మాలలంతా పాల్గొని విజయవంత చేయాలని కోరారు.